క్లుప్తంగా

చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలి



వెంగాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై శ్రీరాములు

బలిజిపేట: చిన్నపిల్లలు వీధుల్లోకి వచ్చేటప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సాలూరు టౌన్ ఏఎస్సై శ్రీరాములు తెలిపారు. వెంగాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చెడు స్పర్శ -మంచి స్పర్శపై గురువారం అవగాహన కల్పించారు. అదేవిధంగా తల్లిదండ్రులకు చెప్పి శక్తి యాప్‌ను అప్‌లోడ్ చేయించాలన్నారు. పిల్లలు పాఠశాలలకు వచ్చే సమయంలో ఎవరైనా కొత్త వారు మిమ్మల్ని పిలిచినా వెళ్లకూడదని తెలిపారు. అదేవిధంగా ఆడపిల్లలు ముఖ్యంగా కొత్తవారు ఎవరు తాకినా వెంటనే కేకలు వేసి సమీపంలో ఉండే వారికి తెలియపరచాలని సూచించారు. ఎవరు ఎటువంటి పదార్థాలు ఇచ్చిన తినకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దోమలమందు స్ప్రే



పెదపెంకిలో దోమలమందు స్ప్రే చేయిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో దోమల నివారణ నిమిత్తం 8వారాలుగా ఒక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దోమల మందు స్ప్రే చేస్తున్నారు. గ్రామంలో ఫైలేరియా వ్యాధి ఉండడంతో ప్రాజెక్ట్ కన్సర్న్ ఇండియా గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో మందు స్ప్రే చేయిస్తున్నారు. దీనిని వైద్యశాఖ పర్యవేక్షించి తగు సూచనలు వారికి ఇచ్చి అవసరమైన చోట చర్యలు చేపడుతున్నారు. దోమల నివారణకు మందును స్ప్రే చేయడం ఎంతో అవసరమని సంస్థ కో ఆర్డినేటర్ పి.వినోద్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉండే వీధులు, కాలువల్లో మందు స్ప్రే చేయిస్తున్నారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది ఉమామహేశ్వరరావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు, యువకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనకు సామాజిక తనిఖీ

సీతానగరం: మండలంలో ఇన్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్(ఐఈసీ)టీం పథకం ద్వారా గ్రామాల్లో ఉండే ఉపాధి శ్రామికులకు మెరుగైన జీవనోపాధి కల్పించడమే ప్రధానలక్ష్యమని ఎస్ఆర్పీ దాసు అన్నారు. ఉపాధిహామీ పనులు-సామాజిక తనిఖీలు తదితర అంశాలపై గురువారం పెదభోగిలి పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ మేరకు ఎస్ఆర్పీ మాట్లాడుతూ శ్రామికులకు ఐఈసీ పథకం ద్వారా పనులు కల్పించడం, ఉపాధిహామీ పథకంలో హక్కులు, సౌకర్యాలు, రాజీలేని అంశాలపై పూర్తి అవగాహన కల్పించినట్లు తెలిపారు. రోజువారీ వేతనం రూ.307 వంతున చేపట్టవలసిన 94 రకాల పనుల గురించి వివరించారు. ఎస్సార్పీ గోవిందరావు, ఏపీఓ బాలకృష్ణ, జేఈ సోమేశ్వర రావు, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు, శ్రామికులు పాల్గొన్నారు.

ఎఫ్ఏ 1 మార్కులు త్వరగా ఆన్‌లైన్ చేయాలి



వెంగాపురం ప్రాథమిక పాఠశాలలో కార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: ఎఫ్ఏ 1మార్కులను త్వరగా ఆన్‌లైన్ చేయాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. ఈ మేరకు వెంగాపురం ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం పర్యవేక్షించారు. ఎసెస్‌మెంట్ పుస్తకాలను పరిశీలించి మూల్యాంకన ప్రక్రియను వెంటనే పూర్తిచేసి మార్కులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థుల నైపుణ్యాలను. చేతిరాతను పరిశీలించి చక్కగా రాసే విధానాన్ని విద్యార్థులకు నేర్పించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. పాఠ్యాంశాల బోధనలో ఉపాధ్యాయులు నూతన బోధన విధానాలను అమలు చేయాలని తెలిపారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉన్నందున విద్యార్థుల నైపుణ్యాలు పెరగాలని సూచించారు. అత్యుత్తమ బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు: విద్యుత్ మరమ్మతుల నిర్వహణ కారణంగా శుక్రవారం సాలూరు పట్టణం, పాచిపెంట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ గోపాలరావు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలో సాలూరు పట్టణం, మండలాల్లోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాచిపెంట మండలంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అన్నదాతకు ఎరువు కరువు

- అందుబాటులో లేని యూరియా
- లింక్ ప్రొడక్ట్స్‌తో బస్తా రూ.500కు అమ్మకం



ఊభాలు చేసిన పంటపొలాలు

బలిజిపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా యూరియా కొరత వేధిస్తోంది. రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కొరతతో ప్రైవేట్ డీలర్లను ఆశ్రయిస్తే లింక్ ప్రొడక్ట్స్‌ను బలవంతంగా అంటకట్టి రూ.500కు యూరియా బస్తాను విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఉభాలు ముందు వెనుక అవడంతో ఎరువుల అవసరాలను బట్టి రైతులు యూరియాను కొనుగోలు చేసుకుందామనుకున్నా సకాలంలో అందుబాటులో లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా బస్తాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మే నెల చివరిలోగానే రైతు భరోసా కేంద్రాలకు కాంప్లెక్స్ ఎరువులను తరలించి పుష్కలంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. బలిజిపేట మండలంలో ఖరీఫ్ సీజన్‌కు మొదటి విడతగా యూరియా, డీఏపీ ఎరువులు ఎక్కువగా అవసరం ఉంటుంది. మండలంలో 20సచివాలయాల పరిధిలో రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వాటికి ఎరువులు సంపూర్ణంగా రాకపోవడంతో రైతులు మండల కేంద్రాలకు పరుగులు పెట్టి పడిగాపులు పడి ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేద్దామన్నా అదిక ధరలు చెబుతున్నా, లింక్ ప్రొడక్ట్స్‌తో కొనాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని రైతులు వాపోతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం:

యూరియా మార్కెట్‌లో లభించడం క్లిష్టతరమవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో ఎరువులకు డిమాండ్ ఉంటుందని తెలిసిన ప్రభుత్వం ఎరువులను అందుబాటులో

- మండలంలో ఖరీఫ్ సాగువిస్తీర్ణం 21వేల ఎకరాలు
- దానిలో వరిసాగు 18వేల ఎకరాలు
- ఇప్పటికి ఉభాలు జరిగినవి 90శాతం
- మొక్కజొన్న 1,800ఎకరాలు
- మిగిలిన భూముల్లో ఇతరత్రా పంటలు పండిస్తారు.
- మండలంలో రైతులు 9వేల నుంచి 10వేల మంది
- యూరియా ఇండెంట్ పెట్టింది 1,510మెట్రిక్ టన్నులు
- ఇప్పటికి వచ్చింది 1,050మెట్రిక్ టన్నులు
- డీఏపీ ఇండెంట్ పెట్టింది 897మెట్రిక్ టన్నులు
- ఇప్పటికి వచ్చింది 800మెట్రిక్ టన్నులు

ఉంచకపోవడంతో తీవ్రంగా కొరత ఏర్పడింది. అదే విధంగా రైతుల అవసరాలకు సరిపడా నిల్వలను తెప్పించడంలో సర్కారు విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటుగా రూ.500

రైతు సేవా కేంద్రాలకు తగినంతగా యూరియా రాకపోవడంతో ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా కొనాలనుకునే రైతులకు వారు షాక్ ఇస్తున్నారు. యూరియా బస్తా కావాలంటే లింక్ ప్రొడక్ట్స్ తప్పనిసరిగా తీసుకోవాలని డిమాండ్ చేస్తుండడంతో రైతు తప్పనిసరి పరిస్థితుల్లో బస్తాను రూ.500 కొనాల్సి వస్తోందని అంటున్నారు. ఒక బస్తావద్ద అదనంగా రూ.200నుంచి రూ.230 వెచ్చించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

వ్యవసాయశాఖ వారి సూచనల ప్రకారం:

వ్యవసాయశాఖ వారు చెబుతున్న సమాచారం ప్రకారం యూరియా వరికి ఎకరాకు 75కిలోల వినియోగం చేయాలని, మొక్కజొన్నకు ఎకరాకు 90కిలోలు, పత్తికి ఎకరాకు 90కిలోలు, పామాయిల్‌కు ఎకరాకు 350కిలోలు మాత్రమే వినియోగించాలని సూచిస్తున్నారు. అలాకాకుండా రైతులు ఇష్టానుసారం వినియోగించడంతో ఎరువుల కొరత వస్తోందని చెబుతున్నారు.

త్వరలో వస్తాయి

ఇండెంట్ ప్రకారం రావాల్సిన ఎరువులు త్వరలోనే వస్తాయి. ప్రైవేట్ మార్కెట్‌లో ఎవరైనా బలవంతంగా లింక్ ప్రొడక్ట్స్‌తో ఇస్తే వెంటనే ఫిర్యాదుచేస్తే తగిన చర్యలు చేపడతాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– శివగణేష్, ఏఓ, బలిజిపేట

కార్యాలయాల చుట్టూ దివ్యాంగుల ప్రదక్షిణ



ఎంపీడీఓ ఆఫీస్‌లో దరఖాస్తులతో నిరీక్షిస్తున్న దివ్యాంగులు

సీతానగరం: రాష్ట్రంలో దీర్ఘకాలంగా అందిపుచ్చుకుంటున్న దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం, కొన్ని పింఛన్లు కుదించడంతో నాలుగు రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని దివ్యాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తినడానికి తిండిలేని దివ్యాంగులు, పేదరికంలో ఉండి అర్హులైన దివ్యాగుల అంగవైకల్యాన్ని గుర్తించిన ప్రభుత్వ వైద్యాధికారులు గతంలో ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు నకిలీవని చెబుతూ అందిపుచ్చుకుంటున్న పింఛన్ దారుల పింఛన్లు రద్దు చేయాలని నిర్ధారించి మళ్లీ రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాగులందరినీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అందుకు సంబంధించిన నివేదికలు ప్రతి సచివాలయానికి అందజేయడంతో అసలు సర్టిఫికెట్స్, దరఖాస్తులు పాత ధ్రువీకరణపత్రం, కొత్త ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో దివ్యాంగులంతా మూడు రోజులుగా గ్రామాల్లో సచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టు పత్రాలతో సహాయకుల సహకారంతో తిరుగుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కొందరికి రెండవ పర్యాయం మెడికల్ చెకప్‌కోసం వెళ్లిన వారికి ఆన్‌లైన్ సర్టిఫికెట్స్ రావడం లేదని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం దశాబ్దాల కాలంగా పొందుతున్న పింఛన్లు రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే ప్రతి గ్రామంలో 15 నుంచి 70 పింఛన్లు రద్దుచేసినట్లు స్థానికంగా ప్రజలు అంటున్నారు. అసలైన దివ్యాంగులకు సంబంధించిన సర్టిఫికెట్స్ ఇచ్చి పింఛన్లు రద్దు కాకుండా ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.

పింఛన్ రద్దు చేస్తే తినడానికి కష్టమే



నేను పేదకుటుంబానికి చెందిన వాడిని. ఎటూ నడవలేను. ప్రభుత్వం ఇస్తున్న దివ్యాంగ పింఛన్‌తో చిన్నషాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. పింఛన్ రద్దు చేయడానికి ప్రభుత్వం సర్టిఫికెట్స్ ప్రొడ్యూస్ చేయాలని ఆదేశించడంతో అన్ని సర్టిఫికెట్స్ సమర్పించాను. తక్కువ పర్సంటేజీ ఉందని పింఛన్ రద్దవుతుందన్న ప్రచారంతో జీవనం సాగదు. నా ఇబ్బందులను గుర్తించి ఇస్తున్న పింఛన్ రద్దు చేయకుండా ప్రభుత్వం పరిశీలించి ఆదుకోవాలి.

ఊళ్ల కృష్ణ, లచ్చయ్యపేట

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు ఈశ్వరరావు

పార్వతీపురం: జిల్లాలోని వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 23 నుంచి 30 వరకు మండలాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు మాట్లాడుతూ జిల్లాలో దళిత, గిరిజన, మైనార్టీ బడుగు, బలహీన వర్గాలకు చెందిన వీఆర్ఏల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ డ్యూటీలను రద్దుచేసి సీనియార్టీ ఉన్న వీఆర్ఏలను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. వీఆర్ఏలకు తక్షణమే స్కేల్‌ను అమలు చేయాలన్నారు. అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్ఓలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. అటెండర్, నైట్‌వాచ్‌మన్ ప్రమోషన్ కోటాను 20 నుంచి 70శాతానికి పెంచాలని, వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రాల్లో ధర్నా నిర్వహించి సెప్టెంబర్ 3న కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 13న పాలకొండలో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలను, డిసెంబర్‌లో విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.కృష్ణారావుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గందరగోళంలో పింఛనర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తిన మోహన్ రావు

పార్వతీపురంటౌన్: చంద్రబాబు మార్క్ పాలనలో పింఛన్ దారులు గందరగోళానికి గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తిన మోహన్ రావు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ రీ వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించి కూటమి ప్రభుత్వం విన్యాసం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులను తొలగించడం, నెలవారీ వచ్చే సామాజిక పెన్షన్లతో బతుకుతున్న వారి పెన్షన్లు తొలగించడం తదితర విన్యాసాలతో ప్రజలను ఇబ్బంది పెడుతోం న్నారు. పింఛన్ల రీ వెరిఫికేషన్ పేరుతో జిల్లాలో సుమారు 2,781 పెన్షన్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. ఇందులో దాదాపు అర్హులైన వారే ఉన్నారన్నారు. గతంలో 100% అంగవైకల్యం, పింఛన్ అర్హమైన 40% ఆపైన అంగవైకల్యం ఉందంటూ డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లు, ఇప్పుడు డాక్టర్ల తనిఖీలో మారిపోవడం గమనార్హం అన్నారు. ఒకే వ్యక్తికి రెండుసార్లు తనిఖీ చేసిన డాక్టర్లు వేరు వేరు పర్సంటేజీలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంలో నూటికి నూరుశాతం డాక్టర్ల వైఫల్యం కనిపిస్తోందన్నారు. ఈ విషయంలో ముందు ఎక్కువ పర్సంటేజీ ఇచ్చి తర్వాత తక్కువ పర్సంటేజీ ఇస్తున్న డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటు పాలకులు అటు డాక్టర్లు, అంగవైకల్యం ఉన్న వారితో ఆడుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ చైర్మన్ వంగల దాలినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు, జిల్లా నాయకులు పాలక రంజిత్ కుమార్, సాలూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ గేదెల రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

సీతానగరం:

మండలంలోని రేషన్ వినియోగదారులకు సరుకులు సకాలంలో డీలర్లు ఇంటింటికీ పంపిణీ చేయాలని, నాణ్యమైన బియ్యం సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ రమేష్‌నాయుడు అధ్యక్షతన డీలర్లతో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బియ్యం నాణ్యంగా లేవని ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఫోన్‌కాల్స్‌కు సమాధానం చెప్పడం మనధర్మమన్నారు. గ్రామాల్లో రేషన్‌డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, పంచదార సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సరుకులు సకాలంలో వినియోగదారులకు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎఫ్ఆర్‌సీ రద్దుచేసి వేతనాలు పెంచాలి

పార్వతీపురం రూరల్: అంగన్వాడీలకు ఎఫ్ఆర్‌ఎస్ రద్దుచేసి వేతనాలు పెంచాలని 1810 మంది మినీలకు పదోతరగతి విద్యార్హత లేని కారణంగా ప్రమోట్ చేయలేనివారిని కూడా సర్వీసు డేస్‌గా ప్రమోట్ చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేసిన అనంతరం తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి మాట్లాడుతూ కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు పెంచలేదని, 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం దాని గురించి పట్టించుకోకపోవడం అన్యాయమని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి అలివేలు, అధ్యక్షురాలు గౌరీమణి, సాయిలత, గౌరి, మండల కార్యకర్తలు, వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

సాలూరు: వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలో నాయకులు మాట్లాడుతూ, ఎఫ్ఆర్ఎస్ రద్దుచేయాలని, అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా ఇవ్వాలని, అంగన్వాడీ యూనియన్‌ను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌వైనాయుడు, శశికళ, గౌరీశ్వరి, పుష్ప, సంధ్య తదితరులున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- సీపీఎం నాయకుడు పి. రాము



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు పి.రాము

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస పంచాయతీలో సీతంపేట, అలాగే గంగాపురం పంచాయతీలో తాన్నవలస గిరిజనుల భూ సమస్యలపై మూడు నెలల క్రితం మే నెల 12న కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశామని సీపీఎం నాయకుడు పి. రాము అన్నారు. అయితే కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ స్థానిక తహసీల్దార్‌ను పిలిచి సర్వే కొలతలు నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ నేటి వరకు పరిష్కార చర్యలు కానరాకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మరో మారు తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. గిరిజనుల భూ సమస్యలపై పరిష్కారానికి కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల సైతం పట్టించుకోకుండా తహసీల్దార్ లాంటి మండల స్థాయి అధికారులు కాలయాపన చేస్తున్నారని సీపీఎం నాయకుడు రాము మండిపడ్డారు. కార్యక్రమంలో హిమరిక చిన్నయ్య, మెల్లిక రాము, తాడంగి రాము, గురవయ్య, లక్ష్మణ, మెల్లిక అంజి, హిమరిక చిన్నయ్య, కద్రక ప్రకాష్, మెల్లిక సింగూరు, కొండగొర్రి రాజు, మండంగి సురేష్, సురేంద్ర, తాడంగి శర్మ, సీపీఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్ రద్దు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

బలిజిపేట: అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఏర్పాటుచేసిన ఫేషియల్ యాప్ రద్దుచేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి దాలమ్మ మాట్లాడుతూ యాప్‌ల వల్ల లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడం, బియ్యం, పప్పు, ఆయిల్, గుడ్లు, కిట్లు ఒకేసారి రాకపోవడంతో లబ్ధిదారులకు అన్నీ ఒకసారి అందించి ఫొటో తీసుకోవడం ఇబ్బందిగా ఉంటోందన్నారు. అదేసమయంలో ఫోన్లు పనిచేయకపోవడం, సిగ్నల్స్ లేకపోవడంతో వచ్చిన లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించి విసిగి తిరిగి వెళ్లిపోతున్నారన్నారు. వీటిని అధిగమించేవిదంగా యాప్ నిర్వహణ సక్రమంగా జరిగేవిధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో సావిత్రి, ఇందిర, సత్యవతి, శారద, లక్ష్మి, స్వర్ణ, పార్వతి, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి మన్మథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో హాని

- ఇప్పటికే వినాయక విగ్రహాలు సిద్ధం



విక్రయానికి సిద్ధంగా ఉన్న పీఓపీ విగ్రహాలు

పార్వతీపురంటౌన్: ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా ఇప్పటికే టన్నుల పీఓపీతో వందలాది విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు భారీ విగ్రహాలను మంటపాల్లో కొలువు దీర్చేందుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలో వేగంగా భారీ విగ్రహాల తయారీ జరుగుతోంది. పీఓపీ నీటిలో కరగదు. మట్టిలో కలవదు. అగ్నిలో దహనం కాదు. నీటిని కలుషితం చేస్తుంది. దీంతో నీటిలోని జీవవైవిధ్యం దెబ్బతింటుంది. పీఓపీ ఉపయోగించి తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం ఎంతో ప్రమాదం. పీఓపీలో ప్రధానంగా జిప్సంను ముడి పదార్థంగా వాడుతారు. ఇది ప్రమాదకర రసాయనం. ఇలా పీఓపీ కలిసే నీటిని ఉపయోగించే మనుషులు, పశువులు డయేరియా, కడుపునొప్పి, చర్మ వ్యాధుల బారినపడతారు. కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. అర్సెనిక్ వల్ల జుట్టు రాలిపోతుంది. సీసం వల్ల శరీరం పటుత్వం తప్పుతుంది. ఈ నీళ్లు పొలాలకు వెళ్లడం వల్ల భూసారం తగ్గి భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో 20106లోనే పలు రాష్ట్రాలు పీఓపీ విగ్రహాల తయారీపై నిషేధం విధించాయి. కానీ సరైన అవగాహన తీసుకురావడంలో యంత్రాంగం చతికిల బడడంతో ఏటా వేలల్లో విగ్రహాలు తయారవుతూనే ఉన్నాయి.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



పీఓపీతో తయారు చేసిన ప్రతిమలను పూజించడం వరకూ ఎలా ఉన్నా.. నీటిలో నిమజ్జనం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురాల్సిన అవసరం ఉంది. అందుకు తగ్గట్లు యంత్రాంగం చర్యలు చేపట్టి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– బోటు రామకృష్ణ, పర్యావరణ ప్రేమికుడు, పార్వతీపురం

సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి యు. మన్మథరావు

పార్వతీపురం టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యు.మన్మథరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సుందరయ్య భవనంలో సీఐటీయూ మహాసభల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమరశీల పోరాటాల సంఘం, కార్మికోద్యమ వేగుచుక్క సీఐటీయూ 11 వ జిల్లా మహాసభలు సెప్టెంబర్ 13, 14 తేదీలలో పాలకొండలో జరుగుతున్నాయని, 13వ తేదీన భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉందని తెలిపారు. ఈ బహిరంగ సభలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వేలాదిమంది ఉద్యోగులు కార్మికులు పాల్గొంటారని, అఖిల భారత రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, బొంకుర సూరిబాబు, జి ఈశ్వరరావు, కృష్ణ, దిలీపు, కృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యంగా శిక్షణ సద్వినియోగం చేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: సత్వర గుర్తింపుతో కేన్సర్ బారి నుంచి తప్పించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. ఎన్‌సీడీ 4.0 లో భాగంగా కేన్సర్ స్క్రీనింగ్‌పై వైద్యాధికారులు, వైద్య సిబ్బందికి గురువారం ఎన్జీఓ హోమ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గైనకాలజిస్ట్, డెంటల్ వైద్యులు కేన్సర్ స్క్రీనింగ్‌పై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీఎంహెచ్ఓ భాస్కరరావు మాట్లాడుతూ కేన్సర్‌లో ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్‌లు ఎక్కువగా నమోదవుతున్నాయని, క్షేత్రస్థాయిలోనే సకాలంలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే వ్యాధి తీవ్రం కాకుండా ఉంటుందన్నారు. మూడు రకాల కేన్సర్లను వైద్య తనిఖీలు,పరీక్షలతో అనుమానిత లక్షణాలను వైద్య సిబ్బంది ఎలా గుర్తించాలి? తదుపరి కార్యాచరణపై శిక్షణలో వివరించిన అంశాల్ని వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు చేసి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ డా.టి.జగన్మోహనరావు, ఎన్సీడీ కోఆర్డినేటర్ డా.సునీల్, డీఐఓ డా.విజయమోహన్, డీపీఎంఓ డా.రఘుకుమార్, ఎపిడిమాలజిస్ట్ డా.కౌశిక్, డీఎంఓ మణి, ట్రైనర్స్ గైనకాలజిస్టులు డా.సౌమ్యశ్రీ, డా.పూర్ణ చంద్రిక, డెంటల్ సర్జన్స్ డా.శ్యామల, డా.లోకేశ్వర్, డెమో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో వెబ్‌సైట్

- సీఐ కె.మురళీధర్



మాట్లాడుతున్న పార్వతీపురం సీఐ కె.మురళీధర్

పార్వతీపురం రూరల్:

మరో ఆరు రోజుల్లో ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన మంటపాల ఏర్పాటు, ఉత్సవ నిర్వహణకు సంబంధించిన అనుమతులను తీసుకునేందుకు రాష్ట డీజీపీ, జిల్లా ఎస్పీ ఆదేశాలతో సింగిల్ విండో వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://గణేష్‌ఉత్సవ్.నెట్ ద్వారా అనుమతుల పొందవచ్చునని పట్టణ సీఐ కె. మురళీధర్ గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు తొమ్మిదిరోజులకు మించకుండా నిర్వహించరాదని, ఊరేగింపు సమయాల్లో బాణసంచా, డీజేలు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. మంటపాల వద్ద మైక్‌సెట్‌లలో భక్తిగీతాలు మాత్రమే వేయాలని, స్థానికులకు ఇబ్బందులకు గురిచేయకుండా భక్తిభావంతో మంటపాల నిర్వహణ ఉండేలా కమిటీ సభ్యులు కార్యాచరణ చేసుకోవాలన్నారు. ఊరేగింపు సమయాల్లో ఆకతాయితనం ప్రదర్శించి పబ్లిక్‌ను ఇబ్బందికి గురిచేస్తే వారిపై కేసులు నమోదు చేయనున్నామని గతంలో ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎస్సైలు గోవింద, జగదీష్‌నాయుడులు ఉన్నారు.